క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులకు సత్కారం

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పలు గ్రామాల్లో సేవలు అందించిన 60 మంది పారిశుధ్య కార్మికులను సత్కరించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల 15 రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న వారిని సత్కరించామని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ రాజాం అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, సర్పంచ్‌లు వాకముల్ల చిన్నంనాయుడు, గెడ్డావు అప్పలనాయుడు, కోనారి అప్పారావు, వెంకటరమణ, నక్క శ్రీను, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం స్వానిధిని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: వీధి విక్రయదారులకు లోక కల్యాణమేళా ద్వారా బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఓ కల్యాణ మండపంలో బ్యాంకు అధికారులు, వీధి విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీలోని 11 సచివాలయాల పరిధిలో వీధి వ్యాపారాలు చేస్తున్న వారు, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. వచ్చిన దరఖాస్తులలో అర్హులను గుర్తించి రుణాలు మంజూరు చేయనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వీధి విక్రయదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి సారె ఊరేగింపు



అమ్మవారి సారెను ఊరేగిస్తున్న మహిళలు

సంతకవిటి: మండల కేంద్రంలో సైఫా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి సారెను గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి మండపానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో యువత, మహిళలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహావీర్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ తదితరులు

బొబ్బిలి: డొంకినవలసలో జూట్‌మిల్లు నిర్మిస్తామని అక్కడి రైతుల వద్ద సేకరించిన మహావీర్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని రైతులకు పంచిపెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల తరబడి కంపెనీ నిర్మిస్తారని ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. కారు చౌకగా రైతుల వద్ద తీసుకున్న భూములను ప్రభుత్వం తీసుకుని పేదలకు, దళితులకు ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించిన అక్రమ మ్యుటేషన్లు తిరస్కరించాలన్నారు. కూటమి ప్రభుత్వ నేతల కళ్లు ఈ భూములపై పడినట్టు తెలిసిందని అన్నారు. ప్రభుత్వ పట్టాల ప్రకారం భూములను తీసుకున్న తరువాత ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోతే తిరిగి స్వాధీనం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం చట్ట ప్రకారం వెళ్లాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, వెంపల బాబ్జీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అజెండా రూపకల్పనలో కూడా..

ఇష్టారాజ్యమేనా..!

- కౌన్సిల్ సభ్యుల ధ్వజం



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిల్ సభ్యుడు చోడిగంజి రమేష్ నాయుడు

బొబ్బిలి: పట్టణ సమస్యలపై ముఖ్యమైన అంశాలను పొందుపర్చి అర్థవంతంగా రూపొందించాల్సిన అజెండా రూపకల్పనలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు తదితరులు ప్రశ్నించారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అజెండా చదువుతుండగా అందులో స్పష్టత లేకుండా, పూర్తి వివరాలను పొందుపరచకుండా రూపొందించడంపై వైఎస్సార్ సీపీ కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పలు వార్డులలో రోడ్ల నిర్మాణం కోసం మున్సిపల్ తీర్మానం కోరుతున్నట్టు అజెండాలో పొందుపరిచారు. అసలు అవి ఏ రోడ్లు ? తారు రోడ్లా లేక సీసీ రోడ్లా, మెటల్ రోడ్లా.. అన్న వివరాలేవీ లేకుండా నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పడం సరికాదన్నారు. అజెండా రూపొందించాక మున్సిపల్ అధికారులు ఓసారి పరిశీలించి తప్పొప్పులను, చేయాల్సిన సవరణలను చేపట్టి తుది కాపీని కౌన్సిల్ హాలులో ప్రవేశపెడితే హుందాగా ఉంటుందన్నారు. అలా కాకుండా ఇష్టారీతిన అజెండాను రూపొందించి చదివించేస్తే గౌరవ సభ్యులకైనా స్పష్టత ఉండాలి కదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీలోని పార్కు, ఫ్లెక్షివర్ ప్రాంతాల్లో బ్యూటిఫికేషన్ కోసం నిధులు మంజూరు చేస్తున్నట్టు అజెండాలో రూపొందించారు. అధికారులు, పాలక వర్గం నిజమైన అభివృద్ధి పనుల కోసం కాకుండా ఇటువంటి పనుల కోసమే నిధులు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పలు అంశాలతో రూపొందించిన ఈ అజెండాను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ



వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు లావేటి రాజగోపాలనాయుడు, బండి నర్సింహులు తదితరులు

రాజాం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతోందని అన్నారు. పార్టీ కార్యకర్తలకు మంచి భవిష్యత్ అందించే దిశగా పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలని, సంబంధిత అధికారులతో పాటు కూటమి నాయకులపై భవిష్యత్తులో చట్టపరమైన చర్యలు ఉంటాయని, పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఈ డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ సర్పంచ్‌ల వింగ్ రాజాం అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, సర్పంచ్‌లు వంజరాపు విజయ్‌కుమార్, నక్క శ్రీనివాసరావు, గెడ్డావు అప్పలనాయుడు, కోనారి అప్పారావు, దబ్బాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో శ్రేణులకు అండగా ఉంటాం..



చిన్నశిర్లాంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

రేగిడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. మండల పరిధిలోని చిన్నశిర్లాంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్తకు అండగా నిలవాలన్నదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన అన్నారు. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరు క్యూ ఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేసుకునే విధంగా అవకాశం కల్పించారన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులు, నాయకులపై భవిష్యత్తులో చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ మేధావుల సంఘం అధ్యక్షుడు కెల్ల మన్మథరావు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, సర్పంచ్‌లు టంకాల ఉమాపాపినాయుడు, వావిలపల్లి చంద్రశేఖర్, లెంక రాంబాబు, ఎంపీటీసీ పిల్లా గౌరునాయుడు, గొర్జాన అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వావిలపల్లి వెంకటరమణ, పొట్నూరు శ్రీనివాసరావు, బుగత రాధాకృష్ణ, మీసాల ఉమామహేశ్వరరావు, భుజంగరావు, కిమిడి మధుసూధనరావు, పేడ్డ రామినాయుడు, చిట్టినాయుడు, పోరావు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వంగర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్‌లో కార్యకర్తలకు అరుదైన గుర్తింపు ఉంటుందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు అన్నారు. వంగరలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అన్యాయానికి గురైన ప్రతీ ఒక్కరూ కూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తమ కేడర్‌కు అన్యాయం తలపెట్టిన అధికారులు, నాయకులకు ప్రజా కోర్టులో నిలబెడతామన్నారు. ఎంఎంఎస్ మాజీ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, ఎంపీటీసీలు కనగల పద్మ, బెవర నూకంనాయుడు, సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, పార్టీ నాయకులు దేవకివాడ దుర్గప్పలనాయుడు, తూముల స్వామినాయుడు, బెవర శ్రీనునాయుడు, యజ్జల రాము, కనగల సత్యంనాయుడు, పారిశర్ల పార్వతమ్మ తదితరులున్నారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు చేస్తున్న జెడ్పీటీసీ, సీడీపీవో

రామభద్రపురం: కొట్టక్కి సచివాలయంలో సీడీపీవో వరహాలమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు సోమవారం నిర్వహించారు. పోషణ మహా ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి పాల్గొని మాట్లాడారు. పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ దేవి పూజలు



వంగర: ఎం.సీతారాంపురంలో సరస్వతీదేవికి పూజలు



రామభద్రపురం: కొట్టక్కిలో పూజలందుకుంటున్న తొమ్మిది ఆకారాలలో ఉన్న నవ దుర్గామాతలు



రాజాం : గాయత్రీదేవి ఆలయంలో సరస్వతీదేవి పూజల్లో భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమివ్వడంతో ఊరూ.. వాడ... అన్ని చోట్ల సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. దుర్గాదేవికి పలుచోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



రేగిడి: అంబకండి గ్రామంలో దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న భక్తులు



బొబ్బిలి రూరల్: కృష్ణాపురంలో సరస్వతీదేవి అవతారంలో దుర్గామాత



రాజాం సిటీ: నవదుర్గ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



రేగిడి: అంబకండిలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు



బొబ్బిలి: బ్యాంకు కాలనీలో పూజలు చేస్తున్న మహిళలు, విద్యార్థులు

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. రాజాంలో ఈపీఎఫ్ పింఛన్‌దారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ మిల్లులు, రైస్ మిల్లులు, షాపులు, ఇతర ప్రైవేటు రంగ సంస్థల్లో పని చేసిన కార్మికులకు ఇప్పటికీ రూ.1000లు ఈపీఎఫ్ వస్తుందన్నారు. ఈ పింఛన్‌తో వృద్ధాప్యంలో ఎలా జీవించేదని ప్రశ్నించారు. 2014లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే కనీసం రూ.6 వేలు చేస్తామని చెప్పి 11 సంవత్సరాలు గడుస్తున్నా ఈపీఎఫ్ పింఛన్‌దారులకు మొండిచేయి చూపుతుందని విమర్శించారు. మరోవైపు పింఛన్ వ్యవస్థపై సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఓపీఎస్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్ పేరిట అనేక కొత్త పేర్లుతో స్కీంలు తీసుకువచ్చి స్వేచ్ఛగా జీవించే హక్కు హరిస్తున్నాయని అన్నారు. కనీస పింఛన్ రూ.9వేలు డీఏతో కలిసి ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు పెన్షనర్లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆనెం సత్యారావు, కొనపల రామ్మూర్తి, కోడి చిరంజీవి, కర్రి లలిత, గంట విజయ, సిక్కాల ఆదినారాయణ, రెడ్డి కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వైద్య సేవలను వినియోగించుకోవాలి

తెర్లాం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలకు మహిళలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ స్వాతి, వంశీకృష్ణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమణ అన్నారు. తెర్లాం పీహెచ్‌సీ పరిధిలోని నందిగాంలోను, పెరుమాళి పీహెచ్‌సీ వద్ద మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన

తెర్లాం: మండలలోని నందిగాం గ్రామ సచివాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ పౌష్టికాహార ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. సోమవారం తెర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం కింద ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తెర్లాం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ స్వాతి, వంశీకృష్ణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ హృదయ దినోత్సవం



పెరుమాళిలో ప్రపంచ హృదయ దినోత్సవం ర్యాలీ

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీ వద్ద ప్రపంచ హృదయ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి వసంతరావు, రాజాం రోటరీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుషింగి యువకుడికి డాక్టరేట్



శీలంకి గోవిందరావు

వంగర: మండల పరిధి రుషింగి గ్రామానికి చెందిన యువకుడు శీలంకి గోవిందరావుకు డాక్టరేట్ లభించింది. తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లా కవిత్వం –పరిశీలన అనే అంశంపై పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ఇటీవల 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడిగా కూడా ఎంపికయ్యారు.

బదిలీ ఎంపీడీవోకు సన్మానం

వంగర: ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఎస్.రఘునాధాచారికి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం జరిగింది. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు ఆయన సేవలను కొనియాడారు. ఎంపీడీవో టి.రాజారావు, ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు, ఏవో తట్టి కోట కన్నబాబు, మండల ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్

రాజాం: గాంధీ జయంతి సందర్భంగా 157 మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి చేపట్టింది. కార్యక్రమంలో మేం సైతం అంటూ రాజాంకు చెందిన రోటరీ క్లబ్ సోమవారం 30 మొక్కలు నాటింది, రాజాం ప్రధాన రహదారిలో డివైడర్ల మధ్యలో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాజాం పర్యావరణ పరిరక్షణతో కలసి నిర్వహించారు. ఆర్‌పీపీఎస్ కన్వీనర్ ఆర్‌వీజే నాయుడుతో పాటు సభ్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ

రేగిడి: మండల పరిధిలోని పెదశిర్లాం గ్రామంలో సోమవారం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు లెంక రాంబాబు పర్యవేక్షణలో భవానీ భక్తులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్దశిర్లాంతోపాటు అంబాడ, వెంకటాపురం, చిన్నశిర్లాం, బుడితిపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

విలువైన భూములు కాజేసేందుకు పన్నాగం

బొబ్బిలి: పట్టణ నడిబొడ్డున గల రాజా కాలేజి ఎదురుగా ఉన్న రూ.20 కోట్ల విలువ చేసే సుమారు ఎకరా స్థలాన్ని రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా వేసి అమ్ముకునేందుకు నాయకులు పన్నాగం పన్నుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు ఆరోపించారు. నిర్దేశిత స్థలం వద్ద పార్టీ నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందనీ 1995లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీ రామారావు సీడీసీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్న విషయం గుర్తు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణం జరుగకపోవడంతో ఇప్పుడా స్థలంలో పలువురు బతుకు తెరువు కోసం వివిధ రంగాల్లో ఉపాధి పొందేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి రేకుల షెడ్లు వేసుకుని బొబ్బిలి రాజులకు అద్దెలు చెల్లిస్తూ వస్తున్నారన్నారు. ఇప్పుడు వారిని ఉన్న పళంగా ఖాళీ చేయాలని రెండు నెలల సమయమిచ్చారన్నారు. దీంతో పాటు ఈపీడీసీఎల్ సిబ్బందికి కూడా వారి మీటర్లు తొలగించాలని ఆదేశాలిచ్చారన్నారు. కూటమి ప్రజాప్రతినిధి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, అధికారుల సహాయంతో డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను చేజిక్కించుకుంటున్నారన్నారు. ఈ వ్యవహారాలపై అధికారులు విచారణ చేయాలన్నారు. అధికార బలంతో పేదలను అణగదొక్కితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే పేదలతోనే ఉద్యమం చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు అప్పారావు, వెంకటరావు, రాయి రామారావు, మండపాక శ్రీనివాసరావు తదితరులున్నారు.

స్వీయ అప్రమత్తతతోనే గుండె వ్యాధుల నియంత్రణ



ప్రపంచ హృదయ దినోత్సవం ర్యాలీ

బొబ్బిలి: స్వీయ నియంత్రణతోనే గుండె వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ అభినయ్ అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా గుండెను కాపాడుకోవాలన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి, చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారికి ఆపిల్ పండ్లను పంపిణీ చేశారు. రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు, ఎన్‌ఆర్‌ఐ సీఈవో సింద్రీ శ్రీనివాసన్, కె.రామకృష్ణ, ఎ.చిన్నారావు, సోమేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.